సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 13 । మార్చి । 2024



గీతాంజలి మృతిపై ఆగ్రహ జ్వాల

టీడీపీ, జనసేన సోషల్ మీడియా మృగాల వికృత చేష్టలతో గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై జిల్లాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



మద్ది క్షేత్రం కిటకిట

జంగారెడ్డిగూడెం రూరల్: గుర్వాయిగూడెం లోని శ్రీ మద్ది ఆంజనేయస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు మంగళవారం దర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సాయంత్రం)	సహరి గురు (ఉదయం)
భీమవరం	6.20	4.54
ఏలూరు	6.20	4.50

న్యూస్‌రీల్

పరిశోధనా ఫలితాల ప్రచురణతో ప్రయోజనం



వెబినార్‌లో పాల్గొన్న ఉద్యానవర్సిటీ వీసీ. టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: ఎప్పటికప్పుడు వెలుగులోకి వచ్చే పరిశోధనా ఫలితాలను ప్రచురించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో మంగళవారం న్యూఢిల్లీలోని డిఫెన్సు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్ సహకారంతో స్కోపస్ ఇండెక్స్ జర్నల్స్‌లో పరిశోధన పబ్లికేషన్స్ నావిగేటింగ్ పాత్‌వేస్ అనే అంశంపై వెబినార్ జరిగింది. ప్రభావవంతమైన, శాస్త్రీయ పరిశోధనలను నిర్వహించడానికి ఇలాంటి వెబినార్‌లు ఉపయుక్తంగా ఉంటాయని డీన్ ఆఫ్ హార్టికల్చర్ ఏఎస్.పద్మావతమ్మ అన్నారు. జర్నల్స్ పరిశోధనా వ్యాసాలు ప్రచురణకు మార్గదర్శకాలపై డైరెక్టరేట్ ఆఫ్ పర్సనల్ డాక్టర్ సంజయ్ ద్వివేది అవగాహన కల్పించారు. డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎస్.సూర్యకుమారి, డీఎస్ఏ సునీత విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం కొత్త డీఎస్పీగా శ్రీనివాస్



నరసాపురం డీఎస్పీ గంటి శ్రీనివాస్

నరసాపురం: నరసాపురం డీఎస్పీగా గంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. విజయవాడ ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పటివరకు ఈ స్థానంలో పనిచేస్తున్న కె.రవిమనోహరాచారిని తిరుపతి ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేశారు. రెండు రోజుల్లో శ్రీనివాస్ విధుల్లో చేరనున్నారు.

ఇంటర్ పరీక్షలకు 97 శాతం హాజరు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలకు 97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐవో కె.చంద్రశేఖర్‌బాబు చెప్పారు. జిల్లాలోని 50 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 13,202 మంది హాజరు కావాల్సి ఉండగా 12,889 మంది, ఒకేషనల్ కోర్సుకు 1,424 మందికి గాను 1,338 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

జంగారెడ్డిగూడెం కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బత్తిన లక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ నరేంద్రకుమార్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.నరేంద్రకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో శ్రీకాళహస్తి నుంచి రాంబాబును ఇక్కడ కమిషనర్‌గా బదిలీ చేసి, ఇక్కడ పనిచేస్తున్న భవానీ ప్రసాద్‌ను సీడీఎంఏకు ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే రాంబాబు ఇక్కడ విధుల్లో చేరలేదు. దీంతో వెలుగు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నరేంద్రకుమార్‌ను ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. విధుల్లో చేరిన అనంతరం కమిషనర్ నరేంద్రకుమార్ మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

15న మినీ జాబ్‌మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో ఈ జాబ్‌మేళా ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. టెక్నో టాస్క్, హెటిరో ల్యాబ్స్, ఇన్నోవా సోర్స్ సంస్థ ప్రతినిధులు హాజరై ఈ జాబ్‌మేళాలో 320 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీటెక్ వంటి విద్యార్హతలు కలిగి ఉండి 18–35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 94934 82414, 96663 22032 నంబర్లకు లేదా 99888 53335 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

ప్రజలందరి గుండె చప్పుడుగా.. దిగ్విజయంగా..

- జిల్లాలో వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ కార్యాలయాల్లో రెపరెపలాడిన జెండాలు
- మహానేత వైఎస్సార్‌కు నాయకులు, కార్యకర్తల ఘన నివాళి

సాక్షి, భీమవరం: పేదల గుండెచప్పుడుగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ 13 ఏళ్ల ప్రస్థానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని 14వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అంతటా సేవా కార్యక్రమాలు, జెండా ఆవిష్కరణలతో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ సంబరాలు అంబరాన్ని తాకాయి.

దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌లు కట్‌చేసి వేడుక చేసుకున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా రాజకీయ పార్టీలు ఏకమై వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా చేసిన కుట్ర రాజకీయాలకు చరమగీతం పాడుతూ అంతులేని ప్రజాభిమానంతో రాష్ట్రంలో ఎదురులేని పార్టీగా నిలపడంలో అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాగించిన పోరాటాన్ని పార్టీ నేతలు గుర్తుచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుని జననేత సాగిస్తున్న ప్రజారంజక పాలన పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆచంట నియోజకవర్గం ఇలపర్రులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. భీమవరంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పార్టీ నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, పార్టీ యువనేత గ్రంధి రవితేజ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తణుకులోని పార్టీ కార్యాలయం వద్ద వేడుకల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ సత్తా కృష్ణవేణి, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయం వద్ద వేడుకల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు, యువనేత కొట్టు విశాల్ పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఉండి నియోజకవర్గంలో పలు చోట్ల వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోదరుడు, పార్టీ నేత గోపాలకృష్ణంరాజు పార్టీ జెండాలు ఆవిష్కరించారు. కేక్‌లు కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నరసాపురంలో పార్టీ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ బర్రె శ్రీవెంకటరమణ, పార్టీ సీజీసీ సభ్యుడు పీడీ రాజు పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్‌చేశారు. పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ సాలా దేవి, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ కేక్ కట్‌చేసి అందరికి స్వీట్లు పంచారు.



ఇలపర్రులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, పార్టీ పశ్చిమగోదావరి అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు



ఏలూరులో పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని



ద్వారకాతిరుమలలో వైఎస్సార్ సీపీ అవిర్భావ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత



కైకలూరులో పార్టీ అవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి సునీల్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



ఉండిలో వైఎస్సార్ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ అరుణ, డాక్టర్ సుందరరామరాజు



ఆకివీడు మండలం కాళింగగూడెంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జోరుగా.. హుషారుగా..

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి మంచి చేశామని చెప్పుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేశారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఏలూరు పార్టీ జిల్లా కార్యాలయంలో తొలుత పార్టీ జెండాను ఎగురవేసి దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి పార్టీ నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు కైవసం చేసుకునేందుకు పార్టీ కేడర్ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఇడా చైర్మన్, నగర పార్టీ అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, పార్టీ నేతలు ఉన్నారు.

- కైకలూరు పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. కైకలూరు సంతమార్కెట్ వద్ద దివంగత వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, పార్టీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ పాల్గొన్నారు.
- నూజివీడు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.
- చింతలపూడిలో ఏఎంసీ చైర్మన్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం టౌన్ మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. దెందులూరు మండలం శ్రీరామవరంలో దివంగతనేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని కట్ చేశారు. పోలవరం నియోజకవర్గంలో ఏడు మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల నాయకులు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉంగుటూరు మండలంలో నారాయణపురం, చేబ్రోలు, ఉంగుటూరు, కైకరంల్లో గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

జ్యోతిరావ్ పూలే సేవలు ఎనలేనివి

- శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- కైకలూరులో ఎమ్మెల్యే డీఎన్నార్ ఆధ్వర్యంలో పూలే విగ్రహావిష్కరణ

కైకలూరు: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలను భారతజాతి ఎన్నటికీ మరువదని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. కైకలూరు కోరుకొల్లు సెంటర్‌లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే నిలువెత్తు విగ్రహాన్ని మోషేన్‌రాజు ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ తన గురువుగా పూలేను ప్రకటించుకున్నారన్నారు. మహిళలకు చదువు చెప్పాలనే ఉద్దేశంతో భార్య సావిత్రీబాయి పూలేకు ముందుగా విద్య నేర్పగా, ఆమె అనేక మంది మహిళలకు విద్యను అందించారన్నారు. పూలే అడుగుజాడలో నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఆయనకు అండగా ఉంటూ మరోసారి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ కైకలూరులో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని బీసీ నేతలు అనేక సంవత్సరాలుగా కోరుతున్నారని, ఎట్టకేలకు వారి కోరిక నెరివేరిందన్నారు. ఇకపై ఈ సెంటర్‌ను పూలే సెంటర్‌గా పిలుస్తారన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంటరమణ మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు నాడు అధ్వాన స్థితిలో ఉండగా, నాడు–నేడు కార్యక్రమం ద్వారా సీఎం వైఎస్ జగన్ వాటి రూపురేఖలు మార్చివేశారన్నారు. పార్టీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పూలే వంటి మహానుభావుల త్యాగాలను అందరూ అర్థం చేసుకోవాలన్నారు. నేడు సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీలు కురేళ్ళ బేబీ, బొర్రా సత్యవతి, ముంగర విజయనిర్మల, కైకలూరు, కలిదిండి ఏఎంసీ చైర్మన్లు చేబోయిన వీరరాజు, కొల్లాటి సత్యనారాయణ, రాష్ట్ర వడ్డీల వెల్ఫేర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, రాష్ట్ర హౌసింగ్, క్షత్రియ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి శ్రీదేవి, గంటా సంధ్య, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, రాష్ట్ర నాయకులు ముంగర నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరావు, ఏసుబాబు, రమేష్, వైస్ ఎంపీపీలు రాచూరి రాథ, కనకదుర్గారాణి, ఆదివిష్ణు, సునీత, నాగలక్ష్మి పాల్గొన్నారు.



కైకలూరులో పూలే విగ్రహావిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

సీఎంను కలిసిన అప్పడా వైస్ చైర్మన్



సీఎం వైఎస్ జగన్‌కు జ్ఞాపికను అందిస్తున్న వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో కలిసి మత్స్యకార భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా 23,458 మంది మత్స్యకారుల సమ్మిళిత అభివృద్ధికి, జీవనోపాధికి రూ.161 కోట్ల 86 లక్షల రెండు వేల నిధులకు సంబంధించిన చెక్కును సీఎం అందజేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వ్యవసాయ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ సూర్యకుమారి, చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారని స్థానిక విలేకరులకు తెలిపారు.

చేయూతతో మహిళల ఆర్థికాభివృద్ధి

- ద్వారకాతిరుమల చేయూత సంబరాల్లో మంత్రి తానేటి వనిత
- చేయూత లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేత


ద్వారకాతిరుమల: అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక శ్రీవారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని చేయూత మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అలాగే పలువురికి ఇంటి స్థలం పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలో 4,204 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నాలుగో విడత చేయూత సొమ్ము రూ.7,88,25,000 జమ అయినట్టు చెప్పారు. ఈ నాలుగేళ్లలో ఒక్కో లబ్ధిదారునికి ఏడాదికి రూ.75 వేలు చొప్పున ఇప్పటివరకు మొత్తం రూ. 31.53 కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. మహిళా సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మన కుటుంబం బాగుండాలని, మన బిడ్డల భవిష్యత్ బాగుండాలని అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేదల సొంతింటి కలను జగనన్న నెరవేరుస్తున్నారని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు అక్కా, చెల్లెమ్మలంతా అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, దాకారపు బంగారమ్మ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు రుద్రనాగ సూర్యకళ, పెద్దిరెడ్డి రమ్యకుసుమ, అంబటి గాంధీ, అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, చిలుకూరి చంద్రం, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి పద్మ జ్యోతి శ్రీనివాస్, చెన్నూరి రామకృష్ణ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో మహిళలకు చేయూత చెక్కును అందజేస్తున్న మంత్రి తానేటి వనిత

సినీ హీరో కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ


భీమవరం: సినిమా హీరోగానే కాక మంచి మనసున్న మనిషిగా సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల గుండెల్లో గూడుకట్టుకున్నారని ప్రముఖ సినీ నిర్మాత, కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో భీమవరంలో ఏర్పాటు చేసిన కృష్ణ కాంస్య విగ్రహాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. అనంతరం త్యాగరాజ భవనంలో ఏర్పాటు చేసిన సభలో ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ సాహసాలకు, సంచనాలకు కృష్ణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని కొనియాడారు. అనేక ప్రయోగాత్మక పాత్రలతో హీరోగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఖ్యాతిని పెంచారన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని భీమవరంలోనే చూశానని, ఇక్కడ అభిమానం మరువలేమన్నారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ నిర్మాతల హీరోగా కృష్ణ పేరొందారని చెప్పారు. మంచి మనస్సున్న వ్యక్తిగా సూపర్ స్టార్ సువర్ణాక్షరాలతో అభిమానుల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాయప్రోలు శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ కృష్ణ పేరుతో నిత్యం సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. చలసాని శ్రీనివాస్, వేగేశ్న కనకరాజు సూరి, రాయప్రోలు భగవాన్, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, కృష్ణ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బరాజు, బోణం ప్రసాద్ పాల్గొన్నారు.



కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిశేషగిరిరావు

సమస్యాత్మక ప్రాంతాలుంటే గుర్తించండి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పక్కాగా గుర్తించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాల గుర్తింపు, ముందస్తు చర్యలపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, ఏఈఆర్వోలు, నియోజకవర్గ ఈఆర్ఓలు, పోలీసు అధికారులు, తదితరులతో సమీక్షించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అనుకూలమైన వాతావరణానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని నియోజకవర్గాల్లో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, ప్రాంతాల్లో ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని సున్నితమైన, సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించారని, ఇంకా ఏవైనా సమస్యాత్మక ప్రాంతాలు ఉంటే తక్షణమే గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ గత ఎన్నికలలో ఎదురైన ప్రతి సంఘటనపై సమీక్షించుకోవాలన్నారు. ఏ కారణంగా గొడవలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పక్కా ప్రణాళికతో ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణరెడ్డి, ఏఎస్పీ వి.భీమారావు, సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, కె.చెన్నయ్య, తణుకు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట రమణ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ అజిత వేజెండ్ల

రిటర్నింగ్ అధికారులదే గురుతర బాధ్యత

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులపై గురుతర బాధ్యత ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమై ఎన్నికల విదివిధానాలపై కలెక్టర్ సమీక్షించారు. అధికారులు సిబ్బంది సమన్వయం చేసుకుని ఎలాంటి చిన్న పొరపాట్లు జరగకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావు లేదన్నారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలకు డీఎస్పీ నుంచి అనుమతి పొందాలన్నారు. రాజకీయ పార్టీల సమావేశాల ఖర్చును ఆ యా పార్టీల ఖాతాల్లో జమచేయాలన్నారు.

గీతాంజలి మృతిపై ఆగ్రహజ్వాల

- టీడీపీ, జనసేన సోషల్ మీడియా వికృత చేష్టలపై ఆగ్రహం
- నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ సంఘాల డిమాండ్
- కొవ్వొత్తులతో గీతాంజలికి నివాళి

ప్రభుత్వం తరపున తనకు ఇంటి పట్టా వచ్చిందని, సంక్షేమ పథకాల రూపంలో తమ కుటుంబానికి ప్రయోజనం కలిగిందని సంతోషం వ్యక్తం చేసిన తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళపై టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకలు వెంటాడి వేధించి ఆమె మృతికి కారణమైన వైనంపై ఉమ్మడి పశ్చిమగోదావరి వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఓ మహిళ అని కూడా చూడకుండా.. తమ ఇంట్లోనూ అక్కచెల్లెళ్లు ఉంటారనే ఆలోచనే చేయకుండా సోషల్ మీడియా వేదికగా వెంటాడి వేధించడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. అసభ్యకర, అభ్యంతకర పదాలతో వేధించిన తీరుకు తాళలేక ఆమె చివరికి బలవన్మరణానికి పాల్పడేందుకు కారణమవడంపై ధ్వజమెత్తుతున్నారు. ఇలాంటి వికృత చేష్టలను ప్రోత్సహిస్తున్న లోకేష్, పవన్‌ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి: గొల్తి గీతాంజలి మృతికి కారకులైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా బాధ్యులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చింతలపూడిలో ఆందోళన చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తనకు ఇంటిపట్టా వచ్చిందని గీతాంజలి చెప్పడమే నేరమని, ఇది తట్టుకోలేక సోషల్ మీడియాలో ఆమెను వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆరోపించారు. బాధ్యులను శిక్షించడంతో పాటు ఇటువంటి వికృత చేష్టలను ప్రోత్సహిస్తున్న నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం రామ్మోహన్‌రావు, నియోజకవర్గ బూత్ మేనేజర్ కాటూరి ఏలియ, ఏఎంసీ డైరెక్టర్ ఎం.ఇమ్మానియేలు పాల్గొన్నారు.

టి.నరసాపురం: గీతాంజలి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, సహకార సంఘం అధ్యక్షుడు పిన్నమనేని చక్రవర్తి తదితరులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గీతాంజలి మృతికి కారణమైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



చింతలపూడిలో ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కామవరపుకోట: టీడీపీ, జనసేన పార్టీ నాయకుల వికృత చేష్టాలకు మృతి చెందిన తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ గుర్రాల రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాలతో వైఎస్ జగన్ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని, ఇది తట్టుకోలేని టీడీపీ, జనసేన నాయకులు రాష్ట్రంలో అల్లర్లు, అలజడలు సృష్టిస్తున్నారన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి

ఆకివీడు: గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని స్వర్ణకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందిన తీరును సోషల్ మీడియా ద్వారా తెలియజేయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో కొందరు యువకులు వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

గీతాంజలికి నివాళి

ఉండి: స్థానిక పెదవంతెన సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ నేతలు కొవ్వొత్తులతో గీతాంజలికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతాంజలిని టీడీపీ, జనసేన సోషల్ మీడియా రాబందులు మానసికంగా వేధించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గులుపెల్లి అచ్చారావు, ధనుంజయరావు, ఎంపీపీ ఇందుకూరి హరిబాబు, అంబటి రమేష్ పాల్గొన్నారు.

గీతాంజలి కుటుంబానికి ప్రభుత్వం అండ



బూసి వినీత

తణుకు: టీడీపీ, జనసేన మూకల వికృత చేష్టల కారణంగానే తెనాలిలో వివాహిత గీతాంజలి బలవన్మరణం చెందిందని మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత పేర్కొన్నారు. జగనన్న తన పేరిట ఇంటి పట్టా ఇచ్చారని, పిల్లల్ని చదివించుకోవడానికి అమ్మ ఒడి కూడా వస్తోందని చెప్పిన మాటలను జీర్ణించుకోలేని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల సోషల్ మీడియా మూకలు దుర్భాషలాడారని దీంతో అవమానం భరించలేని ఆమె ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇలాంటి వేధింపులకు గురయ్యే బాధితులకు పోలీసు శాఖ అండగా ఉందన్నారు. ట్రోలింగ్‌కు గురయ్యేవారు, బాధితులు తమ పరిధిలోని పోలసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయంలో మహిళా పోలీసు ద్వారా కూడా పోలీసులను ఆశ్రయించవచ్చని వినీత భరోసా ఇచ్చారు. నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

టీడీపీ, జనసేన సోషల్ మీడియా వల్లే గీతాంజలి మృతి



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: టీడీపీ, జనసేన సోషల్ మీడియా మాఫియా మారి అమాయకులైన పేదలపై విపరీతంగా ట్రోల్ చేస్తూ వారిని మానసికంగా హింసిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెనాలికి చెందిన గీతాంజలి అనే పేద మహిళను ఈ ముఠా ట్రోల్ చేసి ఆమె ఆత్మహత్యకు కారకులయ్యారని మండిపడ్డారు. పోలీసు కేసులు ఎక్కువ ఉన్నవారికి అంత పెద్ద పదవి ఇస్తామంటూ నారా లోకేష్ టీడీపీ, జనసేన సోషల్ మీడియాను రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. తనకు ఇంటి స్థలం పట్టా వచ్చిందనే ఆనందంతో సీఎం జగన్ పథకాలను మెచ్చుకుంటూ పేద మహిళ గీతాంజలి మాట్లాడడమే పాపమా? అని ఆవేదన వ్యక్తం చేశారు.

గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): బీసీల ఆడబిడ్డ గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన టీడీపీ,ఐటీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ లబ్ధిదారులను కించపరిచే రాజకీయ సంస్కృతి సోషల్ మీడియాలో చూస్తున్నందుకు చాలా బాధ కలుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 33 లక్షల మంది ఆడపడుచులకు వారి పేరు మీద ఇళ్లు ఇచ్చారని, ఆయన చేసిన మంచిని కూడా తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఫేస్‌బుక్‌లో అసభ్యకరమైన పోస్టులకి మానసికంగా కృంగిపోయిన బీసీ మహిళ, విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన ఆడపడుచు గీతాంజలి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. దీనికి కారకులైన వారిని వెతికి పట్టుకుని ఉరిశిక్ష విధించాలని కోరారు. గీతాంజలి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా రాష్ట్రంలోని అన్ని ఎమ్మార్వో, కలెక్టర్ లకు వినతి పత్రాలు అందించాలని లక్కోజు రాజగోపాలాచారి పిలుపునిచ్చారు.

బీజేపీ, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలి



కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారయాత్ర చేస్తున్న దృశ్యం

భీమవరం: దేశానికి అన్నం పెట్టే రైతాంగం కేంద్రప్రభుత్వానికి దేశద్రోహులు, ఉగ్రవాదుల్లా కనిపిస్తున్నారని అందుకనే రైతులు చేస్తున్న ఆందోళనపై దాడులు నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నర్సింహామూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 14న ఢిల్లీలో నిర్వహించే రైతాంగ పోరాటాన్ని విజయవంతం చేయాలని భీమవరంలో మంగళవారం నిర్వహించిన ప్రచార యాత్ర నిర్వహించారు. గడిచిన ఎన్నికల్లో ప్రజలకు ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇవ్వడమేగాక బ్యాంకు బకాయిలు కూడా రద్దు చేస్తున్నారని దుయ్యబట్టారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వకుండా, ఉపాధి కార్మికులకు బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మోసగిస్తున్నారన్నారు. 14న అన్ని మండలాల్లోనూ రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఖండించాలని కోరారు. భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ప్రారంభమైన ప్రచారయాత్ర విస్సాకోడేరు, పెన్నాడ, వీరవాసరం, కొణితివాడ. నవుడూరు, అండలూరు, పాలకోడేరు,ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాలకు ప్రచార యాత్ర చేరుకుంది. ఈ కార్యక్రమంలో బి వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, ఇంజేటి శ్రీనివాసు,ఎం వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెంటపాడు: పురుగుల మందు తాగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మౌంజీపాడులో చోటు చేసుకుంది. ఎస్సై జి. మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పొట్రు శ్రీను (55) మద్యానికి బానిసయ్యాడు. అయితే ఈ నెల 10న ఈ విషయమై భార్య, బంధువులు నిలదీయడంతో మనస్తాపం చెంది అదే రోజు సాయంత్రం కలుపు మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహనరావు తెలిపారు.

క్లుప్తంగా

మాధవాయిపాలెం ఫెర్రీ కొనసాగింపు



జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మాధవాయిపాలెం ఫెర్రీ 2024-2025 సంవత్సరానికి సంబంధించి టెండర్ కం బహిరంగ వేలం పాట నిమిత్తం మంగళవారం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసీ) సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రేవు బహిరంగ వేలం పాట నిమిత్తం ప్రారంభ పాట ధరను ఆమోదించి అనుమతి లభించక పోవడం, సార్వత్రిక ఎన్నికల కోడ్ కొద్ది రోజుల్లో అమల్లోకి వస్తున్నందున ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వేలంపాట నిర్వహించేలా కమిటీ ఆమోదించింది. అయితే ఏప్రిల్ 1 నుంచి గతేడాది పాట మొత్తాన్ని పరిగణలోకి తీసుకుని లేదా ప్రారంభ ధరకు సంబంధించి జిల్లా పరిషత్ నుంచి ఆమోదం లభిస్తే దాన్ని పరిగణలోకి తీసుకుని రోజువారీ పద్ధతిపై చెల్లింపులు జరిగే విధంగా ప్రస్తుత పాటదారు కొనసాగేలా జేసీ తీర్మానించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తమ కమిటీ చేసిన తీర్మానాన్ని ఆమోదం కోసం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపుతామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం, సఖినేటిపల్లి ఎంపీడీఓలు ఎంవీ రమణారావు, వీవీ సత్యనారాయణ,, నరసాపురం, అమలాపురం డీఎల్‌పీఓలు జె.సత్యనారాయణ, పి.బోజీరావు, నరసాపురం, సఖినేటిపల్లి ఎంపీపీలు సోని, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ

అత్తిలి: స్థానిక రామన్నపేటలో గల శ్రీఐశ్వర్యదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో హుండీ పగలగొట్టి నగదును దొంగిలించుకుపోయారు. సోమవారం రాత్రి దొంగలు ప్రధాన గేటు తాళాన్ని పగులగొట్టి గర్భాలయంలో ఉన్న హుండీని తెరచి నగదును దోచుకెళ్లిపోయారు. హుండీలో సుమారు రూ. 40వేల వరకు నగదు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు అత్తిలి పోలీసులను ఆశ్రయించారు.

ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ, ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి కేఎస్ఎస్ సుబ్బారావు అధికారులకు సూచించారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన కార్యకలాపాల జాబితాను తయారు చేసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు సర్క్యులర్‌ను జారీ చేశారు. క్షేత్రస్థాయిలో వీటి అమలుకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను తాత్కాలికంగా తొలగించాలని పేర్కొన్నారు. సచివాలయాల ద్వారా మంజూరు చేసే ధ్రువ పత్రాల విషయంలో ఉద్యోగులకు అవగాహన కల్పించాలని వివరించారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఏ మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: చికిత్స పొందుతూ మండలంలోని గురవాయిగూడెంకు చెందిన వీఆర్ఏ కొదమ సుబ్బారావు (55) మృతి చెందారు. ఈ నెల 5న గురవాయిగూడెంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఘటనలో సుబ్బారావు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు.

జలకళతో సిరుల పంట

- వైఎస్సార్ జలకళ పథకంలో సన్నచిన్నకారు రైతులకు బోర్లు
- రెండు పంటలు పండించుకుంటున్న రైతులు

బుట్టాయగూడెం: రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్న పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాల్లో వైఎస్సార్ జలకళ పథకం ఒకటి. సన్న, చిన్నకారు రైతులతో పాటు 2.5 నుంచి 10 ఎకరాల వరకు భూమి కలిగి ఉన్న రైతులందరికీ జలకళ పథకం వర్తించే విధంగా ఏర్పాటు చేశారు. జలకళ పథకం ఏర్పాటుతో వర్షాధారంపై వ్యవసాయం చేస్తున్న సన్న, చిన్నకారు రైతుకు వరంగా మారింది. రైతుల భూముల్లో ఉచితంగా బోర్లు డ్రిల్లింగ్ చేసి మోటర్లు ఉచితంగా పంపిణీ చేసి భూములు సేద్యానికి అనుకూలంగా మార్చే విధంగా వైఎస్సార్ జలకళ పథకాన్ని 2020 సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జలకళ పథకంలో ఉచిత బోర్లు వేసుకున్న రైతులు తమ పొలాల్లో వివిధ పంటలు పండించుకుంటున్నారు. మొక్కజొన్న, పొగాకు, వరి, మిరప వంటి పంటలు పండించుకుంటున్నారు. తమ బీడు భూములకు సాగు నీరు అందిచేలా జలకళ పథకం ఏర్పాటు చేసిన సిఎం జగనన్నకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సమృద్ధిగా పంటలకు అందుతున్న నీటిని చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అంతర్వేదిగూడెంలో జలకళ పథకంలో వేసిన బోరు నీరు పొలానికి పెడుతున్న బన్నే శ్రీనివాసరావు



వంకవారిగూడెం పూనెం కన్నారావు పొలంలో ఉచిత విద్యుత్ మోటర్‌ను బిగిస్తున్న దృశ్యం

జిల్లాలో మంజూరైన బోర్లు

జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకంలో మొత్తం 5545 ఉచిత బోర్లు వేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. బోర్లు వేసేందుకు సుమారు రూ. 59.67 కోట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ సుమారు 2207 వరకు అధికారులు డ్రిల్లింగ్ చేసి ఉచితంగా బోర్లు వేశారు. అలాగే జిల్లాలో సుమారు బోర్లు వేసిన రైతులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు సుమారు 1036 ఉచిత విద్యుత్ మోటర్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటి వరకూ 296 మంది రైతులకు విద్యుత్ మోటర్లు పంపిణీ చేశారు. ఇందుకోసం సుమారు రూ. 3 కోట్ల 69 లక్షలు ఖర్చు చేశారు.

గిరిజన ప్రాంతంలో ఇలా

పోలవరం నియోజకవర్గంలో గిరిజన ప్రాంతంలో సుమారు 131 మంజూరయ్యాయి. ఇందుకోసం రూ. 62 లక్షల 67 వేలు కేటాయించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో సుమారు 1064 ఉచిత బోర్లు మంజరయ్యాయి. వీటిలో ఇప్పటివరకు సుమారు 371 డ్రిల్లింగ్ చేసి బోర్లు వేశారు. ఇందుకోసం సుమారు రూ. 8 కోట్ల 87 లక్షలు ఖర్చు చేశారు.

గిరిజన ప్రాంత రైతులకు వరం



వైఎస్సార్ జలకళ పథకం గిరిజన రైతులకు ఒక వరంలా ఉంది. కొండప్రాంతంలో వర్షాధారంపై రైతులకు సాగునీరు దొరకని పరిస్థితి ఉండేది. జలకళ పథకం ద్వారా బోర్లు వేయడంతో రైతులకు సాగునీటి కష్టాలు తీరాయి. నియోజక వర్గంలో సన్న, చిన్నకారు రైతులందరికీ జలకళ ద్వారా ఉచిత బోర్లు వేయించే ఏర్పాటు చేశాం.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

సాగు నీటి ఇబ్బందులు లేవు



మా గిరిజన ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు వర్షాధారంగానే పంటలు పండిస్తుంటాం. వానలు కురిస్తేనే పంటలు పండుతాయి. లేకుంటే సాగు నీటి కష్టాలు ఉండేవి. అయితే సిఎం జగనన్న వైఎస్సార్ జలకళ పథకం బోర్లు వేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా విద్యుత్ మోటర్లు తీసుకున్నాం. అధికారులు ఉచితంగా విద్యుత్ మోటర్లు మా పొలాల్లో ఏర్పాటు చేయడంతో సాగు నీటి కష్టాలు తీరాయి. నేను ఈ ఏడాది వైట్‌బార్లీ పొగాకు పంటను నా పొలంలో పండించుకున్నాను.

– బన్నే శ్రీనివాసరావు, రైతు, అంతర్వేదిగూడెం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కొయ్యలగూడెం: క్రేన్ ఢీకొనడంతో ఓ సీపీఐ నాయకుడు మృతి చెందాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మన్నకుంటకు చెందిన దగాని వెంకటేశ్వరరావు (68) మంగళవారం మోపెడ్‌పై వెళుతుండగా, పొంగుటూరు రహదారిలో ఉన్న మద్యం దకాణం సమీపంలో క్రేన్ ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వరావు రోడ్డుపై పడిపోయాడు. అతనిపై నుంచి క్రేన్ వెళ్లడంతో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వరరావు సీపీఐ గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం వారపుసంతలో రోడ్డుపై మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దువ్వ గ్రామానికి చెందిన అలిగి అప్పారావు(47) మృతి చెందగా, బ్రాహ్మణచెర్వు గ్రామానికి చెందిన కడలి గోవిందు అనే యువకునికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే 108 సంఘటనా స్థలానికి వెళ్లి కొన ఊపిరితో ఉన్న అప్పారావును, తీవ్రగాయాలైన గోవిందుకు ప్రథమ చికిత్స చేసి, హుటాహుటిన తణుకు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా అప్పారావు మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు పెనుమంట్ర ఎస్సై పి రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తణుకులో

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం చివటం గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ (43) అదే ప్రాంతానికి చెందిన మరో మహిళతో మంగళవారం బైక్‌పై వస్తుండగా విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్లే వాహనం ఢీకొట్టింది. జాతీయ రహదారి శర్మిష్ఠ సెంటర్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి చిట్టి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్ పేపర్-1, ఎకానమిక్స్ పేపర్-1 పరీక్షలు మంగళవారం తాడేపల్లిగూడెం 5 సెంటర్లలో ప్రగతి, జీఎంఆర్, ఆదిత్య, వాసవి, గోయంకా ఉమన్స్ కళాశాలలో నిర్వహించారు. పరీక్షలకు 1,918 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,875 మంది పరీక్షలకు హాజరైయారు. 43 మంది పరీక్షలకు హాజరు కాలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రతినిధులు వెల్లడించారు.

దండగర్ర విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (పూనా) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ డ్రాయింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ విద్యార్థులు 26మంది ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ విషయాన్ని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

బెస్ట్ జోన్ చైర్‌పర్సన్‌గా పేరిచర్ల మురళీకృష్ణంరాజు



అవార్డులు తీసుకుంటున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ బెస్ట్ జోన్ చైర్‌పర్సన్‌గా పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఎంపికయ్యారు. డైమండ్స్ క్లబ్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా కొప్పిశెట్టి రమణయ్య, బెస్ట్ సెక్రటరీ మద్దుకూరి మోహన్ ప్రసాద్, ఉత్తమ క్లబ్‌గా డైమండ్స్‌లకు అవార్డులు వచ్చాయి. ఆర్సీ మదన్ మోహన్ అగర్వాల్ అధ్యక్షతన పట్టణంలో మంగళవారం రీజియన్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మండపాకలో గడపగడపకు సంక్షేమం



మండపాకలో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్న బూత్ కన్వీనర్లు, వలంటీర్లు

తణుకు టౌన్: తణుకు మండలం మండపాక గ్రామంలో బూత్ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి గడప గడపకు సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండపాక గ్రామంలో మంగళవారం సాయంత్రం మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు, బూత్ కన్వీనర్లు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సీఎం జగన్

పెంటపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచారని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ సలహామండలి సమావేశం ఏవో పార్థసారధి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను వివరించారు.

వన్ నేషన్ వన్ ప్రొడక్ట్



గూడెం స్టేషన్‌లో వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు

తాడేపల్లిగూడెం: వన్‌నేషన్ వన్ ప్రొడక్టు కార్యక్రమంలో భాగంగా గూడెం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మంగళవారం ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వే స్టాల్‌తో పాటు, విద్యుత్ సౌకర్యం కల్పించి తక్కువ ధరకే అద్దెకిచ్చే ప్రాతిపదికన ఇచ్చే జ్యూట్‌స్టాల్‌ను ఇక్కడ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంఎం రమణరావు, ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ జీ.దానయ్య, స్టేషన్ మేనేజర్ వై.నాగరాజు, బుక్కింగ్ సూపర్ వైజర్ బీ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సుసంపన్నమైన పాలన అందించిన సీఎం జగన్

వేడుకగా తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాలు



తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



అత్తిలి: వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండల పార్టీ నాయకులు

తణుకు అర్బన్: పేద, బడుగు బలహీన వర్గాల కష్టాలను తీర్చేందుకే వైఎస్సార్ సీపీ పుట్టిందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తణుకు పార్టీ కార్యాలయంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ పార్టీ స్థాపించి ప్రజా సంకల్పయాత్ర ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కష్టాలను నేరుగా చూసి నవరత్నాలను ప్రకటించి ముఖ్యమంత్రిగా ఎదిగారని స్పష్టం చేశారు. పేదలు, బడుగులపై ఉక్కుపాదం మోపిన పార్టీలను ఎదిరించి ప్రభుత్వాన్ని స్థాపించి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులకు ఆదేశాలిస్తున్నారని అన్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు.

పండ్లు పంపిణీ

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని బాలింతలు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సప్పా బలరామకృష్ణ, రేలంగి రాంబాబు, కుడుపూడి చంద్రరావు, తాటిపర్తి వాసు, ర్యూన్సీ లారెన్స్, ఉండ్రాజవరపు గీత, శకుంతల, పుల్లెపు సూర్యచంద్రరావు, కొఠారు రామాంజనేయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ల కాలంలో సుసంపన్నమైన పాలన అందించిందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం, కృష్ణాయపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి 14 ఏళ్లు కావస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే గత నాలుగున్నరేళ్ల కాలంలో వాటి అమలుకు చర్యలు తీసుకున్నారన్నారు. నవరత్నాలులోని తొమ్మిది పథకాలను 99 శాతం పూర్తి చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో ×మీకు లబ్ధి చేకూరితేనే ఓటు వేయాలని× సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోరుతున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, గజ్జరపు రామకృష్ణ, నల్లూరి శివరామ్, ముప్పిడి లక్ష్మణరావు, ముప్పిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

అత్తిలిలో ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

అత్తిలి: వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసం ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. మంగళవారం అత్తిలి వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. మండలపార్టీ నాయకులు పార్టీ జెండాను ఎగురవేసి, వైఎస్ రాజశేఖరరెడ్డి , వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు మేలు జరగడంతో రానున్న ఎన్నికల్లో మళ్లీ ఈప్రభుత్వానికే పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సంతమార్కెట్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండలపార్టీ నాయకులు రంభసూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, గారపాటినాగరాజు, సబ్బితి రాజేష్, బుడితి సుజన్‌కుమార్, తమ్మాబత్తుల రాము, రాయుడు ధర్మారావు, బొంతా యశోద, గంటా నాగరాజు, కంకటాల సతీష్, కాసగాని అబ్బులు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, యడ్లపల్లి దుర్గారావు, దిరిశాల నాగబాబు, బి ప్రవీణ్‌రాయ్, అంతర్వేది, యాళ్ల సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పార్టీ వైఎస్సార్ సీపీ

తాడేపల్లిగూడెం అర్బన్: పేదల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ అన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొట్టు విశాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన పార్టీ పేదలకు అండగా నిలిచిందన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా పేద ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, వెలనాటి సత్తిబాబు, బొద్దాని శ్రీను, చిటికన ప్రసాద్, గురజాడ ఆనంద్, పత్సమట్ల సావిత్రి, తెన్నేటి జగ్జీవన్, నీలం భూషణం తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

పెంటపాడు: మండలంలో వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. బి. కొండేపాడు గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, రైతులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ బీసీ సంఘ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మర్రే కృష్ణమూర్తి, సొసైటీ త్రిసభ్యకమిటీ సభ్యులు దేవరశెట్టి రాంబాబు, బండారు అప్పన్న తదితరులు పాల్గొన్నారు. రావిపాడు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగువేశారు. సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీల అధ్యక్షుడు కై గాల గణపతి, దేవ వెంకటరమణ, పెన్నాడ రాఘవ, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, పూడి శ్రీను, ఎస్సీ నాయకులు డెక్కపాటి రమణ, తదతరులు పాల్గొన్నారు. పరిమెళ్ల గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్ గొర్రెల వెంకటకోటేశ్వర రావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. విప్పర్రు గ్రామంలో పార్టీ అధ్యక్షుడు బోణం వీరయ్య, జట్లపాలెం గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా వైఎస్సార్ సీపీ అవిర్భావ దినోత్సవం

ఇరగవరం: పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ 14వ అవిర్భావ దినోత్సం ఘనంగా నిర్వహించారు. ఇరగవరం పంచాయతీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ అధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ నవరత్నాలు పథకాలు ద్వారా ప్రతి పేదవాడికి మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, సొసైటి అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, సత్తి వెంకట రెడ్డి , బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి సత్యనారాయణ, వీరవల్లి త్రిమూర్తులు, వీరవల్లి యుగంధర్, శీలబోయిన శ్రీనివాస్, బొక్కా శ్రీనివాస్, కడలి విజయ్ కుమార్, మామిడిశెట్టి శ్రీనివాస్ రావు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా పార్టీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

తణుకు టౌన్: మండలంలోని వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి కేక్‌లను కట్ చేశారు. మండలంలోని వేల్పూరు పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, తేతలిలో పార్టీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావులతో పాటు వివిధ గ్రామాల్లో ఆయా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: మంత్రి కొట్టు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాల్గొన్న కొట్టు విశాల్



తాడేపల్లిగూడెం రూరల్ : జగన్నాథపురంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్, చిత్రంలో సర్పంచ్ చంద్రిక



పెంటపాడు: కొండేపాడు గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రైతులు, నాయకులు



ఇరగవరం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు



అత్తిలి: వరిఘేడులో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ పంపన సత్యవతి



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం గ్రామంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సర్పంచ్ పంపన సత్యవతి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం వరిఘేడు సచివాలయం వద్ద 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జనరల్ చికిత్స 273 మందికి, ఆర్థోపెడిక్ చికిత్స 31 మంది, 35 మంది గైనిక్, రేడియాలజీ చికిత్స, 18 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ టి కిరణ్మయి, డాక్టర్ శాంతి నిపుణ, డాక్టర్ ఆర్ జ్యోతికృష్ణ, కంటివైద్యనిపుణుడు ఎస్ రామిరెడ్డి, హెచ్ఈ జి ప్రమీలారాణి, ఎంపీహెచ్ఎ జెఎస్ గనిరాజు, హెచ్‌వీ పి అమ్మాజీ, హెచ్ఎస్ ఎస్ వెంకట్రాజు, బి స్వరూపరాణి, టి రత్నకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

కృష్ణాయపాలెంలో 396మందికి వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ టి.సింధు, డాక్టర్ కే.సుధాకర్, డాక్టర్ కే.వాసంతిలు 396మందికి వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జి.వెంకటేశ్వరరావు, హెచ్‌వీ సీహెచ్.మణి, సీహెచ్‌వోలు కే.బాబ్జీ, కేవీ.ప్రసాద్, ఎం.ఆశాలత, పి.దివ్య, కే.సత్యవాణి, పి.రవికుమార్, ఏఎన్ఎంలు టి.సుభాషిణి, జి.దీవెనమ్మ, టి.శాంత, సీహెచ్.విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జరపు రామకృష్ణ, నక్కా గంగాధర్, కంఠమణి సత్యనారాయణ, ఎస్.శివరామ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు



వేల్పూరులో టీడీపీ నాయకుల తీరుకు నిరసనగా దీక్షలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రజలకు అవసరమైన ఆధునిక వైద్య సౌకర్యాలతో సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) కల్పిస్తుంటే వేల్పూరు గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే అనుచరులు కోర్టులో కేసులతో అడ్డుకోవడం మానుకోవాలని కోరుతూ వేల్పూరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ కోరారు. మంగళవారం తణుకు మండలం వేల్పూరు గ్రామంలో వేల్పూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీ పెత్తందారుల దారుణాలను నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వేల్పూరు, పరిసర గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా రూ. 6 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ పార్టీ నాయకులు ప్రజల ఆరోగ్యం కంటే షాపులే ముఖ్యమని, ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేయవద్దంటూ కోర్టులో కేసులు వేశారని, దీనితో ఆస్పత్రి నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. గ్రామ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేసి అభివృద్ధిని అడ్డుకోవడం మానుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పలువురు నాయకులు దీక్షలకు కూర్చున్న నాయకులను కలసి తమ సంఘీబావం తెలిపారు.

పౌష్టికాహారం ఆవశ్యకతను గుర్తించాలి

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగల్గుతారని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. పోషణ పక్షోత్సవాలు సందర్భంగా తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో మంగళవారం బాలింతలు తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. మూడేళ్ల పిల్లలకు బాలామృతాన్ని ఇవ్వాలని, ఈ కార్యక్రమంలో అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్మయి, ఏఎన్ఎం రత్నకుమారి, ఎంఎస్‌కే సత్యశ్రీ, అంగన్‌వాడీవర్కర్స్ కె మీనాకుమారి, సిహెచ్ బేబి, వై శ్రీదేవి, జి సావిత్రి, కె ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో పౌష్టికాహార మహోత్సవం

తణుకు టౌన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీవీఆర్ఎస్ కృష్ణకుమారి చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహార మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రోజా లక్ష్మీ, జయలక్ష్మీ, ఆయాలు పాల్గొన్నారు. అలాగే తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఈసీసీ డేలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని తల్లులు, గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తణుకు: తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాల్దరి, నిడదవోలు రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు వచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసినట్లు భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి నీలం రంగు లుంగీ, తెలుపు రంగు పూల డిజైన్ కలిగిన పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 70939 39777కు ఫోన్ చేయాలని సూచించారు.

తెలుసుకున్నవి పాటించండి

తాడేపల్లిగూడెం: తెలుసుకున్న విషయాలను సాగులో పాటిస్తే విజయాలు సాధించడంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్ రైతులకు చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ గిరిజన ఉపప్రణాళిక కింద ఏడాదికాలంగా జీడిమామిడి సాగులో అధిక దిగుబడులు, యాజమాన్య పద్ధతులపై సాగుతున్న శిక్షణా కార్యక్రమం వెంకట్రామన్నగూడెంలో మంగళవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలు, యాజమాన్య పద్ధతులను క్షేత్రస్థాయిలో పాటించాలన్నారు. వర్సిటీ అధికారులు సూర్యకుమారి, డి.వి.స్వామి, ఏవిది.దొరాజీరావు, ఉమాకృష్ణ, పెదబాబు, రవికిరణ్, చాందిసీరాజ్, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

14న చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

తణుకు: ప్రధాని మోదీ అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈ నెల 14న జరిగే ఛలో ఢిల్లీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేసి పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జిల్లా ప్రచార జీపు యాత్ర మంగళవారం తణుకు చేరుకోంది. ప్రభుత్వ ఆసుపత్రి, నరేంద్ర సెంటర్, మునిసిపల్ కార్యాలయం వద్ద జరిగిన బహిరంగ సభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్డగర్ల అజయ కుమారి, మండల అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి, మందులయ్య, మంగతాయారు, వల్లూరి వెంకటేశ్వరరావు, గణేష్, సత్యనారాయణ, కృష్ణబాబు, పోతుశ్రీను, పి.నాగేంద్ర, వెంకన్న, నరేష్, మునిస్వామి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

తణుకు టౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చారని జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి చెప్పారు. మంగళవారం తణుకు మండలం తేతలి గ్రామంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అందజేసిన ఇంటి స్థలాలన్నీ మహిళల పేరుపై ఇచ్చి మహిళల్లో సాధికారతను పెంచారని చెప్పారు. ప్రతి పథకంలో మహిళల కోసం, మహిళల పేరుపైనే అమలు చేసి మహిళలను మహారాణులుగా చేశారని చెప్పారు. ఎంపీపీ రుద్ర ధనరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి అమలు చేసిన పథకాలు దేశంలో ఏరాష్ట్రంలోనూ అమలు చేయలేదన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పేరిచర్ల సతీష్ రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సర్రెళ్ల వీరతాత, నాయకులు దారం శ్రీను పాల్గొన్నారు.